## మంత్రి కేటీఆర్‌ను కలిసిన
# ముదిరాజ్ మహాసభ నాయకులు

జనగామ రూరల్, అక్టోబర్ 25: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్‌ను ముదిరాజ్ మహాసభ జిల్లా నాయకులు బుధవారం హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్‌తో వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ మహాసభ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు చినబోయిన రేఖారాజు మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించారు. రాజకీయంగా ముదిరాజులకు ప్రత్యేక స్థానం కల్పించాలని ఈ సందర్భంగా ముదిరాజ్ మహాసభ నాయకులు కేటీఆర్‌ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. రానున్న రోజుల్లో ముదిరాజులకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వ పరంగా మత్స్యకారులకు సంక్షేమ పథకాలతోపాటు ఉచితంగా చేపల పంపిణీ చేపట్టినట్లు గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను అత్యధికంగా మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజు మహాసభ జిల్లా నాయకులు పాల్గొన్నారు.


మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ముదిరాజ్‌మహాసభ నాయకులు


పోలీసుల కవాతులో జనగామ డీసీపీ సీతారాం, ఏసీపీ దేవేందర్‌రెడ్డి

## ప్రజలు నిర్భయంగా ఓటెయ్యాలి
### జనగామ డీసీపీ సీతారాం

బచ్చన్నపేట, అక్టోబర్ 25 : అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు ప్రశాంత వాతావరణంలో నిర్భయంగా ఓటెయ్యాలని జనగామ డీసీపీ సీతారాం కోరారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో బుధవారం మండల కేంద్రంలో పోలీసులు కవాతు నిర్వహించారు. జనగామ డీసీపీ సీతారాం, ఏసీపీ దేవేందర్‌రెడ్డి నేతృత్వంలో కేంద్ర బలగాలు, ఏఆర్, సివిల్ పోలీసులు పురవీదుల గుండా కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ సీతారాం మాట్లాడుతూ ఓటర్లు తమకు నచ్చిన అభ్యర్థికి ఓటెయ్యవచ్చని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఇందుకనుగుణంగా పౌరులకు స్వేచ్ఛ ఇచ్చిందన్నారు. ఎవరైనా ప్రలోభాలకు గురిచేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ సాయిరమణ, పలు మండలాల ఎస్సైలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి

చిల్పూరు, అక్టోబర్ 25 : ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన హైదరాబాద్-వరంగల్ హైవేపై కరుణాపురం సమీపంలో బుధవారం జరిగింది. ఎస్సై వినయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మసాగర్ మండలం నర్సింగరావుపల్లికి చెందిన యశ్వంత్ (24) బుధవారం హనుమకొండ నుంచి బస్సులో వచ్చాడు. రోడ్డు క్రాస్ చేస్తున్న క్రమంలో భూపాలపల్లి డిపోకు చెందిన బస్సు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని చికిత్సకోసం వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు తరలించగా మృతి చెందినట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

## ఎస్సారెస్పీ కాల్వలో పడి మరొకరు..

పెద్దవంగర, అక్టోబర్ 25 : ప్రమాదవశాత్తు ఎస్సారెస్పీ కాల్వలో పడి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని పోచంపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై పీ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. జనగాం జిల్లా, పాలకుర్తి మండలం, వల్మిడి గ్రామానికి చెందిన దండెంపల్లి శివ(31) ఈ నెల 23న తొర్రూరులో తన మేనమామ ఇంటికి వచ్చాడు. నాంచారిమడూర్ వద్ద గల ఎస్సారెస్పీ కాల్వ వద్ద కాలకృత్యాల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. 24న సాయంత్రం పోచంపల్లి గ్రామ శివారులోని కాల్వలో శవమై తేలాడు. మృతుడి తల్లి దండంపల్లి అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# జనగామ బీజేపీలో 'ముసలం'..

- పార్టీ అభ్యర్థిత్వం దక్కని బీరప్ప వర్గీయుల అసమ్మతి సమావేశం
- అభ్యర్థిని మార్చాలని రాష్ట్ర పార్టీ ముఖ్యనేతలను కలిసి వినతి


హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

జనగామ, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ) : జనగామ నియోజకవర్గ బీజేపీలో ముసలం పుట్టింది..తొలి జాబితాలో టికెట్ దక్కని బీసీ వర్గానికి చెందిన బేజాడి బీరప్ప వర్గీయుల్లో అసంతృప్తి భగ్గుమన్నది. జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడిగా నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి, సేవా కార్యక్రమాలు నిర్వహించిన ఆయన ఇక్కడి నుంచి పార్టీ టికెట్ ఆశించారు. అవకాశం దక్కకపోవడంతో అసంతృప్తితో రగిలిపోతున్న బచ్చన్నపేట మండలానికి చెందిన ఆయన వర్గీయులు, బీసీ కుల సంఘాల ముఖ్యనేతలు రహస్యంగా సమావేశమై అభ్యర్థిని మార్చాలని బుధవారం హైదరాబాద్ వెళ్లి రాష్ట్ర పార్టీ ముఖ్యులను కలిసి వినతిపత్రం అందజేశారు. పార్టీ విడుదల చేసిన మొదటి జాబితాలో జనగామ బీజేపీ అభ్యర్థిగా పార్టీ జిల్లా అధ్యక్షులు ఆరుట్ల దశమంత్‌రెడ్డి పేరును ప్రకటించింది. టికెట్ తనకే దక్కుతుందని ఆశలు పెంచుకున్న బేజాడి బీరప్ప వర్గీయులు నైరాశ్యానికి గురై రెండురోజులుగా బచ్చన్నపేట మండలం తమ్మడపల్లిలో తన వర్గీయులతో అత్యవసర సమావేశం నిర్వహించుకున్నారు. బేజాడి బీరప్ప అభ్యర్థిత్వంపై పార్టీ అధిష్టానం పునరాలోచన చేయాలని, మెజార్టీ నాయకులు, కార్యకర్తల అభీష్టం, సర్వే నివేదికల ఆధారంగా అభ్యర్థిగా ప్రకటించాలని అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. పార్టీ అభివృద్ధి కోసం క్షేత్రస్థాయిలో బేజాడి బీరప్ప సేవలు చేస్తే కేవలం లాబీయింగ్‌తో టికెట్ తెచ్చుకున్న దశమంత్‌రెడ్డికి కనీసం గ్రామాల పేర్లు, కార్యకర్తలు బాగోగులు కూడా తెలవదని అధిష్టానానికి అందజేసిన లేఖలో పేర్కొన్నారు. ఆయన అభ్యర్థిత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లోను ఒప్పుకొనే ప్రసక్తేలేదని బీరప్ప వర్గీయులు అధిష్టానం వద్ద కుండబద్ధలు కొట్టినట్లు సమాచారం. రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జావడేకర్, బీజేపీ జనరల్ సెక్రటరీ సునీల్ బన్సల్, రాష్ట్ర శాఖ అధ్యక్షులు కిషన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, జాతీయ పార్లమెంటరీ బోర్డు సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ పేర్లతో కూడిన ఒక లేఖను జనగామ బీజేపీ అసమ్మతి నాయకులు బుధవారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో అందజేశారు. వెనకబడిన బీసీ వర్గాల నుంచి బలమైన నాయకత్వాన్ని రాష్ట్రపార్టీ ప్రోత్సహిస్తుంటే..జనగామ నియోజకవర్గంలో మాత్రం అగ్రవర్ణాలకు పెద్దపీట వేస్తున్న తీరును కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారని లేఖలో పేర్కొన్నారు. బీరప్ప ప్రతి నెలా లక్షలాది రూపాయలు తన సొంత డబ్బులను ఖర్చు పెట్టి పార్టీ కార్యక్రమాలను చేస్తున్నారని, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో రెడ్లకు సీట్లు ఇచ్చిన సందర్భంలో బీజేపీలో బీసీ స్థానిక బిడ్డకు టికెట్ వస్తే అత్యధిక ఓటర్లు అయిన బీసీలు ఈ నియోజకవర్గంలో పార్టీ పక్షం ఉండే అవకాశం మెండుగా ఉందన్నారు. ఈ సువర్ణ అవకాశాన్ని రాష్ట్ర నాయకత్వం వదిలేసిందని పేర్కొన్నారు. చార్టెడ్ అకౌంటెంట్ వృత్తి నిపుణుడిగా ఈ ప్రాంత ప్రజానికానికి సుపరిచితుడైన బేజాడి బీరప్పకు టికెట్ ఇచ్చే విషయంలో పునరాలోచించాలని కోరారు. పార్టీ నిర్వహించిన సర్వేలో ముందున్న వ్యక్తికి టికెట్ ఇవ్వకుండా బీజేపీ చారిత్రాత్మక తప్పిదం చేసిందని లేఖలో పేర్కొన్నారు. కార్యకర్తల అభిష్టానికి, సర్వే రిపోర్టులకు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయం కార్యకర్తలకు ఆత్మహత్యా సదృశ్యం లాంటిది కూడా అందులో ప్రస్తావించారు.

## హైదరాబాద్ గన్‌పార్కు వద్ద నిరసన

బీజేపీలో కురుమలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని ఆరోపిస్తూ తమ కులానికి చెందిన నాయకులకు టికెట్లు కేటాయించాలని బుధవారం కురుమ యువ చైతన్య సమితి ఆధ్వర్యంలో హైదరబాద్ గన్‌పార్క్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సమితి రాష్ట అధ్యక్షుడు గొరిగె నర్సింహా కురుమ మాట్లాడుతూ బీసీలకు పెద్దపీట వేస్తామని చెప్పిన బీజేపీ తమకు ఒక్క టికెట్ ఇవ్వకపోవడం విడ్డూరం అన్నారు. కురుమలకు టికెట్ల ఇవ్వకుంటే బీజేపీ సభల్లో నల్ల జెండాలతో నిరసన తెలుపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కేవైసీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహేందర్ కురుమ, రాష్ట్ర కార్యదర్శి కోళ్ల రమేశ్ కురుమ, జిల్లా అధ్యక్షుడు బండారు శ్రీశైలం కురుమ, గౌడ రాజ్ కుమార్, కేవైసీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బీర్ల శ్రీనివాస్ కురుమ, ఉబ్బటి సత్యం కురుమ, జోగు సోమయ్య, కట్న సాయి కుమార్, చిందం రాజ్, జిల్లా కార్యదర్శి ఉబ్బటి సత్యం, మిర్యాల సాయి కుమార్, గౌదిచర్ల శ్రీశైలం,భోజన సాయి రాం, బక్క కన్నీ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లకు సర్వం సిద్ధం

- జిల్లాలో ఐకేపీ 79, పీఏసీఎస్ 92 కేంద్రాల ఏర్పాటు
- విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు
- కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య ఆదేశం
- ప్రత్యేక కంట్రోల్ రూమ్ హెల్ప్ లైన్ నంబర్ 6303928718


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, అధికారులు

జనగామ చౌరస్తా, అక్టోబర్ 25 : వానకాలం (2023-24) సీజన్‌కు సంబంధించి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడానికి సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య వెల్లడించారు. బుధవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై సెంటర్ నిర్వాహకులు, సిబ్బందికి శిక్షణా శిబిరం నిర్వహించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్‌సింగ్‌తో కలిసి కలెక్టర్ శివలింగయ్య సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివలింగయ్య మాట్లాడుతూ వ్యవసాయశాఖ అంచనా ప్రకారం వానకాలం సీజన్‌కు సంబంధించి జిల్లాలో 2 లక్షల 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఒకటి, రెండు రోజుల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడానికి అవరసమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలను పరిశీలించిన తర్వాత వ్యవసాయశాఖ అధికారులు రైతులకు టోకెన్లు జారీ చేస్తారని సూచించారు. టోకెన్ల ప్రకారమే ధాన్యం కొనుగోలు జరుగుతుందని కలెక్టర్ శివలింగయ్య తెలిపారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడానికి సరిపడా గన్నీ సంచులు అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల కోసం అనువైన ప్రదేశాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో రైతులకు తాగునీరు, టాయిలెట్స్ మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. కేంద్రాల్లో ధాన్యం కొనుగోలుకు అవసరమైన ఐరిష్ ఎలక్ట్రానిక్ యంత్రాలు, హమాలీలు, రవాణా చేయడానికి లారీలు సమకూర్చాలని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తమ ధాన్యం తీసుకొచ్చే సమయంలో నిబంధనల ప్రకారం మ్యాచ్చర్ చూసి తీసుకురావాలన్నారు. ధాన్యం తీసుకొచ్చిన రైతుల వివరాలను వెంటనే ఓపీఎంఎంఎస్ (ఆన్‌లైన్)లో నమోదు చేయాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని కలెక్టర్ శివలింగయ్య ఆదేశించారు. ఈ ప్రక్రియ ద్వారానే రైతులకు ధాన్యం డబ్బులు చెల్లిస్తామని వివరించారు. కేంద్రాల నిర్వహణలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, నిర్లక్ష్యం చేసేవారిపై ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ హెల్ప్‌లైన్ నంబర్ 6303928718 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్రాల వద్ద రైతులకు ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు లేదా సమాచారం అందించాలన్నారు. జిల్లా వ్యవసాయ, పౌరసరఫరాల, ఐకేపీ, మార్కెటింగ్ సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో కేంద్రాల ఏర్పాటు ప్రక్రియను పరిశీలించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో మొగులప్ప, డీసీఎస్‌వో రోజారాణి, డీసీఎస్ డీఎం ప్రసాద్, డీఎంవో నరేందర్ రెడ్డి, ఏపీడీ నూరుద్దీన్, మహిళా సంఘాల ప్రతినిధులు, పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under the intructions of my client M/s. Shriram Finance Limited Hanamkonda Branch. I issue the following notice to general public. My client intends to grant Loan to Gunde Bujjamma W/o G. Narsaiah Resident of H.No. 6-84-1, Guduru, Palakurthy, Warangal Dist. by keeping the below mentioned property as security by way of Registered Mortgage. As such if any one have any claims changes, Mortgages, Sale Agreements, Court Attachments, Court Disputes etc., shall be informed to the address mentioned below in writing within 3 Days from the date of this notice. Other wise later objections will not bind my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

గ్రామము: గూడూరు, సర్వే నెం. 712, ఇ.నెం. 7-84 యొక్క విస్తీర్ణం 242 చ.గ.లు సరియగు 202.34 చ.మీ.లు కట్టుబడి బెంగుళూరు పెంకల ఇల్లు నిర్మిత ప్రదేశము 551.57 చ.అ.లు గల దాకి హద్దులు: తూర్పు: పులి రమ గారి ఇల్లు, పడమర: గ్రామ పంచాయతి సి.సి. రోడ్డు, ఉత్తరం: మోడం శ్రీను గారి ఖాళీస్థలం, దక్షిణం: గ్రామ పంచాయతీ సి.సి. రోడ్డు.

Sd/- NALLELLA SURENDER, NALLELLA SUHAS
ADVOCATES,
H.No. 1-8-489, Haritha Residency, Balasamudram,
HANAMKONDA, Warangal. Cell: 9849365117